క్లుప్తంగా

ప్రమాదభరిత చెట్టును తొలగించండి



ధరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రమాదభరితంగా ఉన్న చెట్టును వెంటనే తొలగించాలని ఎంఈఓ రవీంద్రబాబు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పాఠశాలల పునః ప్రారంభం నేపథ్యంలో మండల పరిధిలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ధరూరులో ప్రమాదభరితంగా ఒరిగిన చెట్టుతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని చెట్టు తొలగించి మొక్కలు నాటాలన్నారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: ప్రైవేటు పాఠశాలల యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, దుస్తులు, షూలు విక్రయిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని శ్రీ వైష్ణవి, చిన్నతాండ్రపాడులో సమగ్ర విద్యానికేతన్ పాఠశాల ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని.. ఆ పాఠశాలలను మూసివేయిస్తామని పేర్కొన్నారు. గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించరాదని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

పాఠశాలలో ముళ్లపొదలు తొలగించండి సారూ..



మానవపాడు: పాఠశాల ఆవరణలో కళ్లెదుటే ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్న పట్టించుకునే నాథుడే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల ఆవరణ మొత్తం ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు మృత్యువాత



శాంతినగర్: విద్యుదాఘాతానికి గురై ఆవులు మృతి చెందిన ఘటన రాజోళి మండల పరిధిలోని తూర్పుగార్లపాడులో గురువారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. గ్రామానికి చెందిన రామచంద్ర వ్యవసాయ పొలం వద్ద ఆవులు మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

శాంతినగర్: ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధిద్దామని శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్ ప్రజలకు పిలుపునిచ్చారు. షేక్ అస్లాం మాతృమూర్తి షేక్ ముంతాజ్‌బాను జ్ఞాపకార్థం పట్టణంలో గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు సేవా సమితి సభ్యులు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ



మానవపాడు: మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో బోరు మోటారు చోరీ జరిగినట్లు ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాలను సందర్శించి చోరీ వివరాలు వెల్లడించారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రూమాన్ పర్వీన్, ఆలియా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



జాంపల్లిలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న హెచ్‌ఎం రేవతి

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని కొండాపురం, మైలగడ్డ, ఇర్కిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

ధరూరు: మండల పరిధిలోని జీరబండ ప్రాథమిక పాఠశాల, రేవులపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఎంఈఓ రవీంద్రబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అదే విధంగా మండల పరిధిలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రేవతి విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన ఉందన్నారు. కార్పొరేట్ మాయలో పడకుండా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఐకేపీ సీసీ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో ఉన్నత పాఠశాల ముఖద్వారాన్ని తోరణాలతో ముస్తాబు చేసిన ఉపాధ్యాయులు

విద్యార్థులకు ఆహ్వానం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారాన్ని తోరణాలతో అలంకరించి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆహ్వానం పలికారు. కంచుపాడులో మండల విద్యాధికారి రామకృష్ణ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను పీడీ శైలజ, హెచ్‌ఎం హేమలత అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎర్రవల్లి: పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల విద్యాధికారి అమీర్‌పాషా అన్నారు. కొండేరులోని మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, శానిటేషన్ వర్కర్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులు ప్రతిరోజు తరగతి గదులు, పాఠశాల ఆవరణాన్ని శుభ్రపర్చాలన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, శానిటేషన్ వర్కర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదుల సంఖ్యలో హాజరు

మల్దకల్: వేసవి సెలవుల అనంతరం మండలంలోని అన్ని పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ పాఠశాలలో మొదటి రోజు విద్యార్థులు పదుల సంఖ్యలోనే హాజరయ్యారు. మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మొత్తం 554 మంది విద్యార్థులకు 20 మంది, అమరవాయి పాఠశాలలో 160 మంది విద్యార్థులకు గాను 30 మంది విద్యార్థులు హాజరయ్యారు.



జీరబండ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు



నందిన్నె పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



కొండేరులో మాట్లాడుతున్న ఎంఈఓ అమీర్‌పాషా

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ అశోక్‌కుమార్

అలంపూర్: పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. వంటకు నాణ్యమైన కూరగాయలు, సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. వంటగది, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమం జీహెచ్‌ఎంలు మాధవి, బాలజీ, కృష్ణకుమార్, శ్రీనివాసులు, అమరేందర్ రెడ్డి, ఆర్పీ విష్ణు, ప్రధానోపాధ్యాయులు, వంట ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గట్టు: మాజీ ఎమ్మెల్యే గట్టు భీముడికి గురువారం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే 6వ వర్ధంతి సందర్భంగా బల్గెర గ్రామంలో ఆయన సమాధి వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రామన్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, రామకృష్ణనాయుడు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బల్గెర హనుమంతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ఫలాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్ మాదిగ

అయిజ: ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బురి సతీష్‌మాదిగ అన్నారు. గురువారం మండలంలోని ఉప్పల గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సతీష్ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్, కో ఇన్‌చార్జ్‌లు గణేష్, కమలాకర్, హనుమంతు, బుడ్డన్న, యేసేబు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేద్దాం



అలంపూర్ చౌరస్తాలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అలంపూర్: మహనీయుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిబాపూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్, కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన ఉండవెల్లి మండలం కలుగోట్ల గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఉన్నట్లు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆవిష్కర కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు మస్తాన్ మాదిగ, సీనియర్ నాయకులు ఏలీషామాదిగ, శ్రీనుమాదిగ, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ రాజుమాదిగ, నిర్వాహకులు శంకర్, మధు, ఆంజనేయులు, రాముడు, యంగన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం



మాట్లాడుతున్న కుర్వ విజయ్‌కుమార్

గద్వాల: జిల్లాలో సీడుపత్తి రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ నాయకుడు కుర్వ విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీడు కంపెనీలు, ఆర్గనైజర్లు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. సీడుపత్తి విత్తనాలను జీవోటీ ఫలితాల్లో పాస్ అయినప్పటికీ ఫలితాలు తారుమారు చేసి ఫెయిలైనట్లు చూపెడుతూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో సీడుపత్తి రైతులకు జరుగుతున్న అన్యాయంపై తమ పార్టీ నాయకుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన నేరుగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కోదండరెడ్డి ఆధ్వర్యంలో రైతు కమిషన్ బృందం శుక్రవారం గద్వాలలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, రాము, ముద్ద తిమ్మప్ప, నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

గట్టు: పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని గద్వాల సీఐ శ్రీను అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. క్రైం వివరాలు, కేసుల విచారణ, పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించారు. శాంతి భద్రతలకు భంగం కల్గించే వారిపై నిఘా పెంచాలన్నారు. కేసుల నమోదు, ఆధారాల సేకరణ, విచారణ తదితర అంశాలపై ట్రైనీ ఎస్‌ఐలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



ఇందువాసిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులు

శాంతినగర్/ఎర్రవల్లి/గట్టు: భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వడ్డేపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీరభద్రప్ప అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని పైపాడులో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి 17 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటి తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

■ ఎర్రవల్లి మండల పరిధిలోని బొచ్చువీరాపురం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేశారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి నాలుగు దరఖాస్తులు మాత్రమే వచినట్లు తహసీల్దార్ నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శంషీర్, శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ గట్టు మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ పొలాలకు సంబంధించి మొత్తం 25 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పైపాడులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



బొచ్చువీరాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరేష్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



గద్వాల: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ధరూరు మండలం మాల్‌దొడ్డి గ్రామానికి చెందిన ఉలిగెమ్మకు గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రూ.19 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, జిల్లా నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, రంగస్వామి, అంజిసాగర్ పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



ఉండవెల్లి: జిల్లా కేంద్రంలోని డీసీఆర్‌బీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన శేఖర్ ఎస్‌ఐగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన మహేష్ బదిలీపై వంగూరు మండలానికి వెళ్లడంతో ఆయన స్థానంలో చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందికి ఎస్‌ఐకు అభినందనలు తెలియజేశారు.

ప్రమాదాలకు బాధ్యులెవరు..?



కూలిన ఇనుప కంచెపై కూర్చున్న యువకులు

- పుష్కరఘాట్లలో పొంచి ఉన్న ప్రమాదం
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇనుప కంచెలు
- వందల సంఖ్యలో భక్తుల రాక

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని కృష్ణానది పుష్కరఘాట్లలో భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు గతంలో వచ్చిన వరదల ధాటికి పూర్తిగా ధ్వంసమై తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు భక్తులు వాపోతున్నారు. వందల సంఖ్యలో భక్తులు బీచుపల్లి క్షేత్రాలకు వస్తున్న అధికారులు మాత్రం రక్షణ చర్యలు చేపట్టడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వందల సంఖ్యలో భక్తుల రాక

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అభయాంజనేయస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, /జ్ఞాన సరస్వతి ఆలయంతో పాటు శివాలయం వంటి ప్రముఖ ఆలయాలకు నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుంటారు. పుష్కరఘాట్లలో స్నానాలు చేసే ప్రదేశం, కృష్ణమ్మ విగ్రహం వద్ద రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో భక్తులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రతిఏటా నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే బీచుపల్లి జాతర, వినాయక నిమజ్జనం సమయంలో భక్తులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఘాట్‌ల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



కృష్ణమ్మ విగ్రహం చుట్టూ ధ్వంసమైన ఇనుప కంచె

ప్రమాదాల బారిన పడుతున్నారు



పుష్కరఘాట్ వద్ద ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. పండుగలు, ప్రముఖ దినాల్లో భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకుంటారు. యువకులు ఘాట్లలో సెల్ఫీలు దిగు తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. – నరేష్, భక్తుడు

అధికారులకు విన్నవించాం



పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా అధికారులకు గతంలో విన్నవించాం. ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. – నర్సమ్మ, మాజీ సర్పంచ్, బీచుపల్లి పంచాయతీ

చెరువును తలపిస్తున్న కాలనీ



అయిజలోని రాయచూర్ రోడ్డు పక్కన కాలనీలో నిలిచిన వర్షపు నీరు

అయిజ: తేలికలపాటి వర్షానికే పట్టణంలో రాయిచూరు రోడ్డు పక్కన కాలనీ చెరువును తలపిస్తుంది. గతంలో నిర్మించిన కల్వర్టును పూడ్చి వేయడంతో వర్షంనీరు నిలిచిపోతుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో గురువారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులుతో విన్నవించుకోగా మున్సిపల్ సిబ్బంది కల్వర్టుకు అడ్డుగా మట్టి తొలగించి వర్షం నీరు పారేలా చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఈదురుగాలులతో మోస్తరు వర్షం

ధరూరు: మండల పరిధిలోని ఎములోనిపల్లి, ఉప్పేరు, చింతరేవుల గ్రామాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. బుధవారం రాత్రి ధరూరు, మన్నాపురం, బూరెడ్డిపల్లి, మార్లబీడు, కోతులగిద్ద, జాంపల్లి, దోర్నాల, గుర్రోనిపల్లి గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన పదును వర్షం పడింది. వర్షంతో రైతన్నలు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. సాగు పంటలకు వర్షం అనుకూలంగా ఉన్నట్లు రైతులు పేర్కొన్నారు.



ఉప్పేరులో కురుస్తున్న వర్షం